


వైదేహి అప్పుడే వంట పూర్తిచేసుకుని ముందు హాల్లోకి వచ్చింది.

సంజె చీకటులు మెల్లగా పాకుతూ వస్తున్నాయి.

చల్లగా వీచిన పిల్లగాలులతోపాటు కలసివచ్చిన సన్నజాజుల మధురమైన సువాసనలు వేసవిసాయంకాలపు రామణీయకతను తెలియ జేస్తూన్నాయి.

వాకిటిముందుపిల్లలుఆడకుంటున్నారు. వాళ్ళకిందపడి నలిగిన ధూళి పైకి లేచి గాలిలో కలిసి ముందుకు సాగిపోతూంది. భూమికి అతిసమీపంలో, చేత్తో అందుకునేందుకు వీలుగా కొత్త రంగుమబ్బులు లేచినట్లనిపిస్తుంది ఆ దృశ్యం చూస్తే.

రెండు మూడుసార్లు కేకేసింది పిల్లల్ని వైదేహి. కానీ ఆటలో తన్మయత్వం చెందిన పిల్లలకు ఆమె పిలుపు వినిపించలేదు. అందుకని ఆ ప్రయత్నం విరమించుకుని వరండాలో కొచ్చి వాళ్ళ ఆటను చూస్తూ నిలుచుంది.

నిశాదేవి నవ్వింది చీకట్లను వెదజల్లుతూ.

"ఈరోజు కిక ఆటలు చాలు. వచ్చి స్నానం చేయండి," అంది పిల్లల నుద్దేశించి.

బాగా చీకటి పడడంతో పిల్లలంతా ఎవరిళ్ళకు వాళ్ళు బయలుదేరారు.

వైదేహి నలుగురు పిల్లలూ బిలబిలమంటూ లోపలికి వచ్చారు.

హాల్లో లైటు స్విచ్ ఆన్ చేసి చిన్న పిల్లలిద్దరినీ తీసుకుని బాత్‌రూం వేపు నడిచింది వైదేహి.

బాయిలర్‌లో కాగిన నీళ్ళు బకెటులోకి పట్టి చిన్నపిల్లలిద్దరికీ స్నానాలు చేయించి, పెద్దపిల్లలిద్దరినీ వెళ్ళి స్నానాలు చేసి రమ్మంది. మరో అర్ధగంటకల్లా అందరికీ ముస్తాబు పూర్తిచేసి అన్నం పెట్టింది.

చిన్నపిల్లలిద్దరూ పడుకున్నారు.

పెద్దపిల్లలిద్దరూ అరుణా, కరుణా బొమ్మల పుస్తకాలు తిప్పుతూ కూర్చున్నారు.

అప్పటికి గంట ఏడున్నరైంది.

రేడియో ట్యూన్ చేసి, కుర్చీలో కూర్చుంది.

లతామంగేష్కర్ కంఠం మధురంగా వినిపిస్తోంది.

సాయంత్రం ఆరింటికల్లా వినిపించే సుపరిచితమైన బూట్లచప్పుడు అంతవరకూ వినిపించక పోవడంతో డోలాందోళనా మనస్క అయింది వైదేహి.

"నాన్నగారింకా రాలేదేమమ్మా ?" అ౯న పెద్దపిల్ల అరుణ మాటలకు ఉలికిపడి చూపులు త్రిప్పి వారి వేపు చూసింది.

"రోజూ ఈ వేళకు వచ్చేసే వారుగా?" తిరిగి అరుణే అంది.

"ఏదన్నా పనుండి ఆ ల స్య మై ం ది కాబోలు" సాలోచనగా అంది.

"నాకు బొమ్మల పుస్తకం తెస్తానన్నారు." ఆఫీసుకు వెళ్ళేటప్పుడు తండ్రి చేసిన వాగ్దానాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ అంది అరుణ.

"నాలుగురోజులకో బొమ్మల పుస్తకం కావాలంటే ఎలా వస్తుంది? ఒకసారి కొని తెచ్చిన పుస్తకం చింపుకోకుండా జాగ్రత్తగా పెట్టుకోవాలిగానీ ... నెలకు పది పుస్తకాలు కావాలంటే డబ్బు కావొద్దూ?" మందలింపు ధోరణిలో అంది వైదేహి.

"నాన్నగారి దగ్గర చాలా డబ్బుందిగా?" కళ్ళు గుండ్రంగా తిప్పుతూ, చేతులతో అభినయం చేస్తూ అంది కరుణ.

"ఆఁ ఉంది! ఊళ్ళోళ్ళవాళ్ళ డబ్బు!" అంది వైదేహి. అలా అంటున్నప్పుడు ఆమె గొంతులో ఏహ్యం, కోపం, బాధ మొద

లయిన భావాల తాలూకు జీరలు సుళ్ళు తిరిగాయి. చూపులు రేడియో మీదున్న కవరుమీద వాలాయి. అప్పటికే ఆ కవరు లోని విషయాన్ని పదిసార్లకు పైగా చదివినా మరోసారి చదవాలన్న ఉత్కంఠను అణచుకోలేకపోయింది వైదేహి.

కవరులోని పేపరుతీసి మరోసారి చదివింది.

అది సమితి ఆఫీసునుండి వచ్చిన అపాయింట్‌మెంట్ ఆర్డర్.

ఆఊళ్ళోనే ఉన్న సమితి స్కూల్లో ఆమెను క్లర్కుగా నియమించినట్లు తెలియజేశారు.

ఉదయం ఆ కవరు అందినప్పటినుండీ ఆమె సంతోషానికి అవధులే లేవు.

ఎన్నాళ్ళనుండో ఎదురుచూడగా, ఈరోజు శుభవార్త ఊడిపడింది.

అయితే, సంతోషంతో ప్రఫుల్లమైన ఆమెముఖం మారి కొద్ది క్షణాల్లోనే మ్లానమైపోయింది.

ఆర్డర్ కాగితం టేబులుమీదున్న పేపర్‌వెయిట్ క్రింద పెడుతూ గాఢంగా నిశ్వసించింది.

ఆలోచనలు పరిపరివిధాల పయనిస్తున్నాయి.

తను ఉద్యోగం చేయడం వారికిష్టం లేదు.

ఏదో అవకాశం ఉండటంవల్ల పి. యూ. సీ. వరకు చదువుకో గలిగింది.

అవసరం ఉంది. అవకాశం లభించింది. అలాంటప్పుడు తను ఉద్యోగం చేస్తే తప్పేమిటి?

"షేమ్! ఆఫీసరు భార్యవై ఉండి మరొకడిక్రింద పని చేయడమా? వీల్లేదు వైదేహీ!" అన్నారు ఒకసారి ఆ ప్రస్తావన తాను తెస్తే.

"ఆఫీసరన్న హోదాయేగానీ, మూడొందల రూపాయలజీతం కూడా రావటంలేదే! చాలనప్పుడు నేనూ ఉద్యోగంచేస్తే తప్పేమిటి?"

"నీకు నేను అన్నం పెట్టలేని రోజు అలాగేవెళ్ళు, ఉద్యోగం చేద్దువులే!" అంటూ కోపంగా, విసురుగా వెళ్ళిపోయారు.

ఆఅర్థంలేనిఅభిమానానికి తనకు బాగా కోపమొచ్చింది.

పెళ్ళికిముందూ, పెళ్ళయ్యాక కొన్నాళ్ళవరకు ఎన్నో ఆదర్శాలున్న శ్యామసుందరం అలా ఎందుకు మారిపోయాడో ఎంతగా తలబ్రద్దలు కొట్టుకున్నా వైదేహికి అర్థంకాలేదు.

విద్యావతీ, రూపవతీ, గుణవతీ అయిన కన్యను కట్నకానుకలతో ప్రమేయం లేకుండా చేసుకుంటానని తనను చేసుకున్నారు.

రెకమెండేషన్స్‌వల్లగానీ, లంచంఇచ్చిగానీ ఉద్యోగం సంపాదించనని పట్టుబట్టి డిగ్రీ తీసుకున్న రెండు సంవత్సరాలకు ఈ ఉద్యోగం సంపాదించుకున్నారు.

అలాంటివారు తమ ఆదర్శాలనన్నింటినీ ఎలా మరచిపోగలిగారు?

ఇలా వక్రమార్గంలో....

అందుకు పరిస్థితులే ముఖ్యకారణమా? పరిస్థితులు బాగాలేనిమాట నిజమే.

పెళ్ళయి ఆరుసంవత్సరాలు దాటింది. నలుగురు పిల్లలు.

నాలుగోవాడి కాన్పప్పుడు స్టెరిలైజ్ చేయించుకుంది. ఇక పిల్లలు పుట్టరు.

అది కొంత ఓదార్పు.

కానీ, ఉన్న ఆ నలుగురి పిల్లలకే అమరిక సరిగ్గాలేదు. వస్తున్నజీతం చాలడం లేదు.

దాంతో ధనాన్వేషణకు దారులు వెదకడం నేర్చుకున్నారు వారు.

చేస్తున్నది బోడి ఆఫీసరు ఉద్యోగమే గానీ, వస్తున్నజీతంమటుకు మూడువందలకు లోపే.

కట్సన్నీపోగా చేతికొచ్చేది బోటాబోటిగా రెండొందలు. అందులో ఇంటి అద్దె ఎలక్ట్రిసిటీ వీటికే అరవై వరకూ పోతుంది. పాలకు మరో యాభై.

బియ్యానికీ, వెచ్చాలకూ మరో నూటపాతికవరకూ అవుతుంది. ఇకపోతే పనిమనిషి, వంటచెరకూ, కూరగాయలూ, మందులూ, పాలడబ్బాలూ, (బట్టలూ), అనుకోకుండా తగిలేఖర్చులూ వీటికంతా ఓ నూరన్నా అవుతుంది పిల్లలకూ తనకూ బట్టలుకొనాలంటే సంవత్సరానికి మూడువందలన్నా అవుతుంది. వారి బట్టలకు సరేసరి, మరో మూడు వందలన్నా కావాలి.

ఏ ఖర్చు తగ్గించుకుందామన్నా వీలు కాకుండా ఉంది. ఇరవై రూపాయల్లో ఓ చిన్న ఇల్లు తీసుకుందామని ప్రయత్నించిందిగానీ, వారు పడనివ్వలేదు. గాలీ, వెలుతురూ ప్రవేశించేందుకే భయపడే గుహల్లాంటి ఇళ్ళను రెండింటిని చూసి పిల్లలనందులో వేసి బంధించడం న్యాయం కాదని ఆ ప్రయత్నం పూర్తిగా విరమించుకుంది.

పాల ఖర్చు తగ్గిద్దామంటే, అసలు వీలుకాని పని. పోస్తున్నదే నీళ్ళపాలు. ఆ మాత్రమన్నా కొనిపోయకుంటే ఈసురోమంటూ ఉంటారు పిల్లలు.

పిల్లలు ఆరోగ్యంగా, పుష్టిగా ఉండాలని ఇద్దరికీ ఇష్టమే.

పిల్లల సంఖ్య ఎక్కువై పిల్లలు ఎదిగి వస్తున్నకొద్దీ, ఖర్చుల సంఖ్య పెరగసాగింది.

ప్రతి నెలా బడ్జట్ లోటే!

క్రొత్తలో ప్రతి నెలా మొదటి తారీఖున ఆ లోటు బడ్జట్‌ను చూసి చింతాక్రాంతులై చెంపలకు చేతులు చేర్చి కూర్చుండిపోయేవారు తామిద్దరూ!

మరి ఓ సంవత్సరంగా ఈ లోటు బడ్జెట్ పూరించను వీల్లేకుండా, చేతికి అందకుండా పోతూంది! అందువల్ల ప్రతి నెలా వందో రెండు వందలో అప్పు తీసుకరావలసిన పరిస్థితి ఏర్పడుతూంది.



నెలనెలా అప్పు పెరిగిపోతూనే ఉంది.

తీర్చేదారి కనిపించడమే లేదు.

అప్పును గురించి తాను బాధపడవలసిందేగానీ, వారు పట్టించుకోవడం మానేశారు.

ఓలెడంత అప్పు నెత్తిమీదుంచే రేడియో, ఫర్నిచర్ తీసుకొచ్చారు.

అదేమని తాను ప్రశ్నిస్తే దేని దాని దానిదే నన్నారు నవ్వుతూ!

రకరకాల ఆలోచనలు తనను సతమతం చేస్తున్నాయి,

"అమ్మా! నిద్రొస్తుందే!" అంది కరుణ ఆవలిస్తూ.

దాంతో ఈ లోకంలోకి వచ్చింది. వైదేహి.

అరుణ కను రెప్పలుకూడా బరువుగా వాలి ఉన్నాయి.

ఇద్దరికీ పక్క వేసి పడుకోబెట్టింది.

గంట ఎనిమిదిన్నరయింది.

అప్పటికీ శ్యామసుందర్ రాకపోవడంతో వైదేహి గుండె గుబగుబలాడింది.

వరండాలో కెళ్ళి ఆచివరినుండి ఈ

చివరి వరకూ వీధంతా కలయజూసి, ఉస్సురుమంటూ తిరిగి హాల్లో కొచ్చి కుర్చీలో కూలబడింది.

తిరిగి ఆలోచనలు ఆమెను బంధించాయి.

ఆ రోజు తనకు బాగా గుర్తుంది.

సాయంత్రం తినుబండారాలూ, పూలూ, బట్టల ప్యాకెట్లూ తీసుకుని రిక్షా దిగారు.

చాలా రోజులుగా వారి వైఖరి గమనిస్తున్న తనకు, తన అనుమానాలే నిజమైనట్లు తోచింది.

నిగ్గదీసి అడిగింది.

సూటిగా జవాబు చెప్పక తప్పించుకునేందుకు ప్రయత్నించారు.

"ఇది నిజంగా కష్టపడి సంపాదించిన డబ్బేనా?"

"ఎలాగయినా అనుకో!" నవ్వుతూ జవాబిచ్చారు. విలవిలలాడింది మనసు. వారెలా నవ్వగలుగుతున్నారు!

"మీరిలాంటి దారి తొక్కుతారనుకోలేదండీ!"

"ఇందులో పెద్దగా బాధపడవలసింది ఏముంది వైదేహీ?"

"తప్పులేదని సరిపుచ్చుకునే స్థితికి నేనింకా రాలేదండీ!" బరువుగా నిట్టూర్చి అంది.

"అవతలివాళ్ళు అడిగిన పని చేసిపెట్టినప్పుడు వాళ్ళు తృప్తిచెంది తృణమో పణమో ముట్టజెప్తున్నారు. సంతోషంగా ఇచ్చినదాన్ని పుచ్చుకుంటే తప్పేముంది?"

ఈ కుతర్కానికి విలవిలలాడిపోయింది.

అయితే, అంతో ఇంతో ముట్టజెప్పి బి. ఎ. ప్యాసుకాగానే ఉద్యోగం ఎందుకు సంపాదించుకోలేదు? రెండు సంవత్సరాలు ఉద్యోగం లేకుండా ఎందుకు బాధపడ్డారు? ఆనాటి ఆశయాలన్నీ ఏమయ్యాయండి?" బరువైన కంఠంతో అంది.

"ఆ రోజులువేరు, ఈ రోజులు వేరు వైదేహీ! ఆశయాచరణ ఈ రోజు గగన కుసుమం. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు ఏం చేస్తాం చెప్పు?"

"ఎంతబాగా సమర్థించుకుంటున్నారండీ!" ఆశ్చర్యంతోనూ, ఆవేదనతోనూ అంది.

"సమర్థించుకోవడం ఏముంది? నలుగురూ వెళ్ళేదారే మనదీనూ. మడికట్టుకుని కూర్చున్నంత మాత్రాన జరిగేదేమీలేదు. పైగా నలుగురూ చేతగానివాడంటారు. మన మంచితనాన్నీ, నీతినీ, నిజాయితీనీ చూచి గేలి చేస్తారు. చాటుగా నవ్వుకుంటారు. తమ సర్వశక్తులనూ ఉపయోగించి కుళ్ళులోకి లాగేందుకు ప్రయత్నిస్తారు. పరాజయం వాళ్ళకెన్నడూ కలగదు. ఒక్కడు పది మందితో ఎంతసేపు పోరాడగలడు?" నష్ట స్వరంతో అన్నారు.

"ఏం పిరికిపాఠాలు చెప్తున్నారండీ! మీ తప్పును ఒకరిమీద రుద్దేందుకు ఎందుకు ప్రయత్నిస్తారు?

"సరే, ఇదే నా తప్పే! ఒప్పుకుంటాను. ఇక వాగ్వివాద మెందుకు?" చికాగ్గా అన్నాడు.

"అంటే, ఇదిలా సాగవలసిందే నన్నమాట? మానడమంటూ ఇక లేదా?"

"అబ్బ! ఇప్పుడవన్నీ ఎందుకు? నీ పనేదో నువ్వు చూసుకోరాదూ?'' చికాకుతోపాటు కోపం కూడా మేళవించిన కంఠంతో అన్నారు.

"అయితే, మీ రెలా సంపాదించినా నోరు మూసుకుని చూస్తూ ఊరుకోమంటారు. తెచ్చింది మహాప్రసాదంగా స్వీకరించమంటారు?" హేళనగా అంది.

"లోకంలో నీ కొక్కదానికే కలిగింది గాబోలు ఆక్షేపణ! ఏం? అందరాడవాళ్ళూ నోళ్ళు మూసుకొని పడి ఉండడం లేమూ? ఇంటికొస్తే కాసేపు హాయిగా ఉండే అదృష్టం లేదు. ఎప్పుడూ ఏదో ఒక సాధింపు.''

తనకేడుపొచ్చినంత పనయింది. అయినా, సంబాళించుకునిఅంది. "సాధింపు కాదండీ! మన మంచికే చెప్తున్నాను. కర్మం కాలి రేపు ఉద్యోగం ఊడిపోతే ఏం చేద్దాం? ఉద్యోగం పోయినా, కాలు మీద కాలేసుకుని కూర్చుని తినేందుకు వెనక ఆస్తేమన్నా ఉందా? లేకుంటే, మనం సంపాదించి దాచిన డబ్బేమన్నా బ్యాంకులో మూలుగుతూందా?" నచ్చచెప్పే ధోరణిలో అంది.

వారు చురచురా తనవేపు చూస్తూ, "పోనీలే, నా కుద్యోగం పోతే నువ్వుద్యోగం చేద్దువుగానీ. అంతవరకు హితబోధ చాలించి, కాస్త ప్రశాంతంగా ఉండనివ్వనన్ను-" వ్యంగ్యంగా, కటువుగా అన్నారు.

"అప్పుడు వెలగబెట్టే ఆ ఉద్యోగమేదో ఇప్పటినుండీ వెలిగిస్తేనేం?'' కోపంగా అంది.

''అక్కర్లేదు! నీకు నేను తిండి పెట్టలేని రోజు అలాగే ఉద్యోగం చెయ్యి. లేదా ఊళ్ళేలు! అంతేగానీ, ఈ లోపల నువ్వు ఉద్యోగం చేసి సంపాదించి పెట్టవలసిన అవసరం లేదు" తీవ్ర తిరస్కార స్వరంతో అన్నారు.

"అంటే భార్య ఉద్యోగం చేస్తే భర్త అసమర్థుడనా అర్థం?"

ఎంత వ్యంగ్యంగా అనగలదో అంత వ్యంగ్యంగానూ అంది.

"అని నా అర్థం కాదు! జన వాక్యం!" హేళనగా నవ్వుతూ అన్నారు.

తన మనసు కుతకుత ఉడికిపోయింది. పట్టరాని ఆవేశంతో తాత్కాలికంగా విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయింది.

"భార్య కష్టించి, ఉద్యోగం చేసి న్యాయమార్గంలో డబ్బు సంపాదించడం మీ గౌరవానికీ, ప్రతిష్ఠకూ, మీ పురుషత్వానికీ గొడ్డలిపెట్టు! భార్యను అమ్ముడు పోవడం, ఆమె తెచ్చిన కట్నంతో సుఖంగా జీవించడం, కార్లెక్కి షికార్లు కొట్టడం గౌరవహాని కాదా? ఆడపిల్లల తలిదండ్రు

లను డబ్బుకోసం పీక్కు తినడం అమానుష త్వం కాదా?" ఆవేశంతో అరిచింది.

"ఇక చాలించండి మేడమ్! వేల వేల కట్నాలు తెచ్చి నా ముఖాన కొట్టినట్లు ఏవిటా ప్రగల్భాలు!"

"లోకం సంగతి మాట్లాడుతున్నాను. ఏం? కట్నం తీసుకోలేదని ఇప్పుడు విచారిస్తున్నారా?"

"విచారించటం లేదుగానీ, నాభార్య నాకింత కట్నం తెచ్చిందని గొప్పగా చెప్పుకుని, గర్వంగా తలఎత్తి, ఠీవిగా నడిచి వెళ్ళే మహామహులముందు నేను దేనికీ పనికిరాకుండా పోయానని నాబాధ. నా ఆదర్శానికి బయటి ప్రపంచంలో విలువేలేదు!"

"సిగ్గులేకపోతే సరి! చట్టవిరుద్ధమైన పనిచేసి, ఏదో దేశం కోసం ప్రాణాలర్పించి నంతటి ఘనకార్యంచేసినట్లు అంతగర్వంగా, బాహాటంగా ఎలా చెప్పుకో గలుగుతారు? చేసిన నేరానికి సిగ్గుతో కుమిలిపోవలసిన మాట!" చీత్కారంగా అంది తను.

"అంతేగదా! ఆ సిగ్గులేనితనం నాకే నేమో అనుకున్నాను!"

కొంచెం కోపంగా, కొంచెం హాస్యంగా అన్నారు.

అంతకోపంలోనూ తనకు నవ్వొచ్చింది.

"మీకు అభిమాన మనేది ఉంటే ఇలాంటి నీచమైనపని ఎందుకు చేస్తారు? ఎవ్వరికీ తెలియకుండా ఎన్ని తప్పులయినా చేయవచ్చు నన్నంతటి నీచత్వానికి మీరు దిగజారారంటే, ముందు నాకు సిగ్గుగా ఉంది?"

వారి అభిమానాన్ని రెచ్చగొట్టాలనే అలాగంది తను.

"ఇక నీతిబోధ ఈరోజుకు చాలించి స్నానపానాదుల విషయం చూడు! చదువుకున్న భార్యను చేసుకున్నందువల్ల పెద్దగా లాభాలేమీ కనిపించటంలేదుగానీ, పెద్దనష్టం మటుకు ఒకటి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది."




తనను కవ్విస్తూ అన్నారు.

అడగరాదని అనుకుందిగానీ, అయినా కుతూహలాన్ని చంపుకోలేక "ఏవిటది?" అంది.

"ఇదిగో! బ్రతుకు జీవుడా అని కొంప చేరితే, ఇలా వాగ్వివాదం పెట్టుకుని కూర్చోవడం'' తనకన్నుల్లో చివ్వున నీళ్ళు తిరిగాయి.

రోషంతో ముఖం ఎర్రబడి, సెగలు కక్కింది వేడినెత్తురుతో.

అభిమానం గ్యాస్ స్టౌవ్‌మీద పెట్టిన పాలలా బుస్సున పొంగింది.

"సరే! అలాగయితే నాకు విడాకు లిచ్చేసి, ఒకచింతమొద్దును తెచ్చుకుని..." ఉక్రోషంతో కోపంతో దుఃఖంతో గొంతు పూడుకుపోయింది.

"అదేం కుదరదు! అలాగయినా ఉద్యోగం చేసుకోవా లనుకుంటున్నావు గాబోలు!" అంటూ తన ఇష్టానికి వ్యతిరేకంగానే దగ్గరకు తీసుకుని, చెక్కిలిమీటి కళ్ళల్లోకి ప్రేమగా చూశారు.

"హు...ఇదోనటన" కసిగా అంది.

"ఉహు...ఇది నిజరూపం! ఇన్నిపాట్లు పడడం నీ కోసమేగా వైదేహీ!" లాలనగా అన్నారు.

"అదోముసుగు పైగా! ఈ సంపాదనంతా నా కోరకే అయినప్పుడు, ఈరకం సంపాదన నా కిష్టం లేదని చెప్తున్నానుగా. ఇది ఎప్పటికైనా ముప్పేనండీ! మొన్న చూడండి ఆ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విషయం ఏమైందో.''

పదపద, నీళ్ళుతోడుదువుగానీ. అపశకున పక్షిలా నీ మాటలూ నువ్వూ.

బాత్‌రూంవేపు నడుస్తూ "ఈ పద్ధతి మానెయ్యండి! నేను ఉద్యోగం చేస్తాను" అన్నమాటలను అస్పష్టంగా గొణుక్కుంది.

ఆ మర్నాడే వారికి తెలియకుండా అప్లికేషను పెట్టింది

ఈ రోజుకు ఉద్యోగం వచ్చింది.

కానీ. వ్చ వా రొప్పుకుంటారారా?

ఏమో ఇంకా రారేం?

టేబిలు మీదున్న గడియారంవేపు చూపులు మళ్ళించింది.

తొమ్మిదిన్నరయింది గంట. ఉద్యోగమేమో వచ్చింది. కానీ ఏంలాభం?

వారొప్పుకోరు. కానీ, ఎలాగయినా ఒప్పించాలి.

వారి నా తప్పుత్రోవనుండి మళ్ళించాలి. ఇదికష్టమే. సులభంగా డబ్బుసంపాదించటం నేర్చినవారు ఎవరైనాసరే, కష్టపడేందుకు ఇష్టపడరు. కానీ, భవిష్య

త్తును, పిల్లల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని తనేదో ఒకమార్గం చూడాలి.

నలుగురికీ ఆదర్శంగా ఉండవలసిన వారు నలుగురిలో ఒకరై కలిసిపోరాదు.

వైదేహి మెదడు చకచకా ఆలోచించసాగింది.

ఠంగుమని పదిగంటలు కొట్టేసరికి, వైదేహి మెదడులో తళుక్కుమని మెరుపులా ఓ ఆలోచన మెరిసింది.

సినిమాచూసి పదిగంటలకు వాకిట్లో అడుగుపెట్టిన శ్యామసుందర్‌కు వైదేహి ముఖవైఖరి తీవ్రాఘాతాన్ని కలిగించింది.

చెంపకుచెయ్యిచేర్చి విచారంగాశూన్యంలోకి చూస్తూ కూర్చుంది.

"ఏవిటలా ఉన్నావు ?" ఆత్రుతనిండిన స్వరంతో అడిగాడు.

కొద్దిక్షణాలు భర్తముఖంలోకి నిశితంగాచూసి– "మీ బాబాయిట, ఉదయం వచ్చారు. మిమ్మలను కలుసుకోవాలంటూ ఆఫీసుకొచ్చారు, కనిపించారా ?" అంది.

విస్మయ విప్పారితలోచనాలతో భార్య వేపుచూస్తూ–

"ఉహు ... ఏబాబాయీ నా దగ్గరకు రాలేదే ?" అన్నాడు.

"అయితే, నా అనుమానమే నిజమయ్యేట్టుంది" గాఢంగా నిట్టూర్చి అంది.

"ఏవిటీ నీ అనుమానం ?" ఆత్రుత ఆందోళన నిండినస్వరంతో అన్నాడు.

"ఇదేనిజమైతే మనబ్రతుకులిక నిరాధారమైనట్లే." సజలనయనాలతో శ్యామసుందర్ వేపు చూస్తూ అంది.

బెంబేలు పడిపోయాడుశ్యామసుందర్.

అవ్యక్తమైన భయం అతన్ని సమూలంగా కలచివేసింది.

"ఏవిటి వైదేహీ ! అసలు విషయం చెప్పు.." కంపిత స్వరంతో అన్నాడు.

"చెప్తాలెండి! ముందు భోజనం కానివ్వండి !" అంది విషాదభరిత స్వరంతో.

"ఇప్పుడన్నానికొచ్చిన తొందరేంటి ? ఆ శుభవార్తేంటో చెప్పు" బరువుగా నవ్వుతూ అన్నాడు.

"మీ బాబాయినని తనకుతాను పరిచయం చేసుకుని ఓమధ్యవయసులో ఉన్న పెద్దమనిషి వచ్చాడు..." జీరగొంతుతో అని భర్తముఖంలోకి చూసింది పరిశీలనగా.

"మా బాబాయిలంతా నీకుతెలుసుగా."

"తెలుసండీ ! ఎక్కడెక్కడి సంబంధమో తెచ్చి కలిపాడండీ ! మోసపోయాను సుమా ! ఇప్పుడు ఖచ్చితంగా తెలిసింది అతనెవరో..."

"ఎవరు ?"

"సి. ఐ. డిపార్ట్‌మెంటుకు సంబంధించిన వాడని..."

"ఆఁ !...నిజమా, వైదేహీ."

"అవునండీ! అతనడిగినవిషయాలనుబట్టి, అతని మాటలతీరునుబట్టీ, అతను సి.ఐ.డి. అని ఇప్పుడు నిర్ధారించుకున్నాను.'' విషణ్ణవదనంతో అంది.

అప్రతిభుడై చాలా సేపటివరకూ అలాగే నిలుచుండి పోయాడు శ్యామసుందర్.

తర్వాత కుప్పగా కుర్చీలో కూలబడిపోతూ ''అసలేం జరిగిందీ వైదేహీ ! వివరంగా చెప్పు" అన్నాడు కంపితస్వరంతో.

వైదేహి విచారతప్త స్వరంతో తన కథను ప్రారంభించింది.

"మీ బాబాయినని పరిచయం చేసుకుంటూ, మీరున్నారా అని అడిగారండీ! లేరు, ఆఫీసుకెళ్ళారన్నాను. మీరు ఇంట్లో లేకపోయినందుకు తన విచారాన్ని ప్రకటిస్తూ, మీతో అత్యవసరమైన పనుండి వచ్చినట్లు చెప్పారు. నమ్మాను. కాఫీ చేసిచ్చాను. తాగి ఈజీచేర్లో పడుకుంటూ ఓ అర్ధగంట విశ్రాంతి తీసుకుని, మీ ఆఫీసుకు వెళ్ళి మీతో మాట్లాడి ఊరెళ్ళాలన్నారు. నేను ఆయనకు భోజనం ఏర్పాట్లు చేసేందుకు లోపలి కెళ్ళాను. లోపలున్న దాన్ని పిలిచి "అబ్బాయి బాగా సంపాదిస్తున్నట్లున్నాడే ?" అన్నారు.

"ఏంసంపాదన లెండి! ప్రతి నెలా లోటు బడ్జెటే !" అన్నాను.

"అదేమిటమ్మాయ్. అలా అంటావు? బాగా సంపాదిస్తున్నాడని చెప్పుకోగా విన్నాను. ఇంట్లో వస్తువులూ అవీ బాగా కొనిపెట్టినట్లుందే !" అని హాలు నలుమూలలా చూపులు సారించి చూశారు.

"అవన్నీ కొన్నవా ఏమిటి? అంత సామాను కొనేపాటి తాహతు మా కెక్కడుంది లెండి!" అన్నాను నోరు జారి గబుక్కున.

"ఓహో! అలాగా! అయితే, ఇవన్నీ ఎలా వచ్చాయంటావు?" అన్నారు.

"వాళ్ళూ వీళ్ళూ బహుమతులుగా ఇచ్చినవి" అన్నాను మనవాడేకదా అన్న ధీమాతో.

"నిజంగా ఆ మాటన్నావా ?" అమురుతున్న గుండెలతో ప్రశ్నించాడు.

"నిజంగానే అన్నానండీ! బుద్ధి పనిచేయలేదు" "అయితే ఈ రేడియో కొన్నది కాదా ?" అన్నారు రేడియోను పరీక్షించి దాన్ని నాణ్యతను మెచ్చుకుంటూ" దీనంగా ముఖంపెట్టి భర్తవేపు చూస్తూ అంది.

"ఏం చెప్పావు? తెలివి తెల్లారినట్లే ఉంది." కోపంగా, ఆత్రంగా, కటువుగా అన్నాడు.

"నాకేం తెలుసండీ, అతను సి. ఐ. డిపార్టుమెంటుకు సంబంధించినవాడని ... తెలిస్తే నోరు విప్పేదాన్నా ?" పైట చెరగుతో కళ్ళొత్తుకుంటూ అంది.

"హు ... చదువుకున్నంత మాత్రాన తెలివితేటలొస్తాయా? తర్వాత విషయం చెప్పు..." అని దీర్ఘంగా మూల్గాడు.

"అంత మంచి రేడియో కొనేందుకు డబ్బెక్కడిది? ఏదో పనిచేసిపెడితే ఎవరో కంట్రాక్టరు బహుమతిగా ఇచ్చాడట... అన్నాను." "అయితే పనిచేసినందుకు ఆఫీ

సులో జీతం తీసుకోవడం లేదటే అమ్మాయీ?" అన్నారు.

"ఎందుకు తీసుకోరు? ఆ జీతం నెలలో పదిరోజులకుకూడా చాలదు!" అన్నాను.

"ఓ మాట అమ్మాయ్!" అన్నారు రహస్యం చెప్పినట్లు.

"ఏమిటి?"

"ఈ విషయాలన్నీ బయటకు పొక్కవు కదా? తెలిస్తే ప్రమాదం కదూ?"

'ప్రమాదమని చిన్నగా అంటారా? తెలిస్తే ఇంకేముంది ఉద్యోగానికే ముప్పు!' అన్నాను.

"అలాగే రకరకాల ప్రశ్నలు వేసి అన్ని ఆరాలూ తీశారు. వెఱ్ఱిబాగులదాన్ని ఇంత కపటముంటుందని నాకేం తెలుసు?"

'ఉఁ!...' ఉస్సురుమన్నాడు శ్యామ సుందర్. "ఓ గంటసేపయ్యాక ఆఫీసు కెళ్ళి అబ్బాయిని కలుసుకుని వస్తానంటూ, భోంచేసి వెళ్ళమని చెప్తున్నా వినిపించుకోక వెళ్ళిపోయాడు!"

"ఎవడో బాబాయంటూ వస్తే వాడితో ఈ కబుర్లన్నీ ఎందుకు?" చిరాగ్గా కోపంగా అన్నాడు.

"బాగుంది! ఏదో పెద్దవాడు. కష్ట సుఖాలు విచారిస్తుంటే అబద్ధాలాడలేక పోయానండీ!" పశ్చాత్తాప తప్త స్వరంతో అంది.

"రేపు ఉద్యోగానికి ముప్పొస్తే, అప్పుడు తెలుస్తుందిలే!" రెండు చేతుల్లో తలదాచుకుని అన్నాడు.



కొద్ది క్షణాలు మౌనంగా జరిగిపోయాయి. బెరుగ్గా, భయంగా అంది వైదేహి. "అసలతను సి. ఐ. డిపార్ట్మెంటుకు సంబంధించినవాడేనంటారా?" దోసెట్లో తలదాచుకోనున్న శ్యామసుందర్ చివాల్న తలెత్తి వైదేహి ముఖంలోకి చూస్తూ–

"ఆహా! ఇంకా సందేహమెందుకు? నామీద ఇప్పటికే రహస్య దర్యాప్తు జరుగుతూందని చూచాయగా తెలిసింది! ఇక ఉద్యోగం పోవటం ఖాయం!"

భయంగా చూసింది వైదేహి.

"ఉద్యోగం పోతే ఎలాగండీ ?" విహ్వాల స్వరంతో చేతులు నలుపుకుంటూ అంది.

"ఎలాగంటే నే నేం చెప్పను ? చేసి పెట్టావుగా ఘనకార్యం! నీ తెలివితక్కువతనానికి అందరం శిక్ష అనుభవించాలి."

"సస్పెండ్ చేస్తారా ?"

"సస్పెండేమిటి ? డిస్మిస్ చేసి పారేస్తారు ?"

"ఇక మన మేం చెప్పుకున్నా లాభం లేదంటారా ?"

"అంత గొప్ప సాక్ష్యం నువ్విచ్చాక, ఇక చెప్పుకోవడమేమిటి ? తీసుకున్నట్లు నీ కంటే మంచి సాక్ష్యం మరెవరి దగ్గర నుండి వస్తుంది ?"

"అయ్యో ! పాపిష్టిదాన్ని ! ఇలా అవుతుందని అనుకోలేదండీ ! చేతులారా మీ ఉద్యోగానికి ఎసరు పెట్టాను ... ఇంకెలాగండి !" అని చీర చెరగులో ముఖం దాచుకుంది.

అంత కోపంలోనూ భార్య కన్నీరు చూశాక శ్యామసుందర్ కాస్త మెత్తబడ్డాడు.

"ఊర్కో...జరిగేదేదో జరుగుతుంది. ఏంచేస్తాం?" ఊరడింపుగా అన్నాడు.

"తర్వాత పిల్లల గతేమిటి? వాళ్ళకు కనీసం కడుపునిండా అన్నమన్నా పెట్టొద్దూ? వెనక ఒక్క పైసా నిలవలేకపోయె..." చీర చెరగులోనుండి తలెత్తి జీరబోయిన కంఠంతో అంది.

"దేవుడేదో ఒకదారి చూపకపోడు... ధైర్యంగా ఉందాం. అంతకంటే ప్రస్తుతం చేసేదేమీలేదు." నిర్లిప్త స్వరంతో అన్నాడు.

"ధైర్యంగా ఉండడం ఎలాగండీ? మళ్ళీ మీకు ఉద్యోగం దొరికే అవకాశం ఉందా?"

"అంత సులభంగా దొరకుతుందా? పైగా ఓ బ్లాక్ మార్కు పడినప్పుడు..."

"ప్రస్తుత పరిస్థితిలో నాకన్నా ఉద్యోగము కొన్నాళ్ళపాటు దొరికితే బాగుండును. ఆఁ! అన్నట్టు నామతిమరుపు చూడండి! మొన్ననంగా వచ్చిన అపాయింట్మెంట్ ఆర్డర్ విషయం మీతో చెప్పనేలేదు..." అంటూ ఏమాత్రం సందేహించక అపాయింట్మెంట్ ఆర్డర్ మొన్నవచ్చినట్లు తొణక్కుండా అబద్ధమాడింది !

శ్యామసుందర్ భార్య ముఖంలోనికి అదోరకంగా చూస్తూ "ఎప్పుడు అప్లై చేశావు ?" అన్నాడు.

సందేహపు నీలి నీడలు అతని కన్నుల్లో కదులుతున్నాయి.

"చాలారోజులయింది. మీకు తెలీకుండా అప్లై చేశాను, తెలిస్తే అప్లై చెయ్యనివ్వరని..."

అతి వినయంగా విన్నవించుకుంది.

"ఏదీ ఆర్డర్" అయిష్టంగా అడిగాడు.

ఎక్కడో పెట్టి మరిచిపోయినట్లు కాసేపు, వెదికి చివరకు టేబిలు మీదున్న దాన్ని తీసి భర్త చేతిలో పెట్టింది.

తిరిగివెళ్లి గోడకానుకుని నిలుచుని భర్తముఖంలోకి పరిశీలనగా చూడసాగింది.

"ఊఁ?..ఏవిటి నీఉద్దేశం?" ఆర్డర్ కాగితంలో నుండి తలెత్తి ప్రశ్నించాడు.

"నా ఉద్దేశం మీకు తెలుసు. ఇక ప్రత్యేకంగా చెప్పవలసిందేమీలేదు."

మరో రెండునిముషాలు మౌనంగా బరువుగా నలిగిపోయాయి ఇద్దరిమధ్యా.

"నేనుద్యోగం చేయడం మీకిష్టంలేదని నాకు తెలుసు. అయినా, నిరాధారంగా ఉండడంకన్నా, ఏదోఒక ఆధారం కొన్నాళ్ళపాటు ఉండడం..." మెల్లగా అని మధ్యంతరంలోనే ఆగిపోయింది.

సాలోచనగా బరువైన కంఠంతో శ్యామసుందర్ –

"ఇప్పుడే నాఉద్యోగం పోయినట్లు మాట్లాడుతున్నావే."

"అహా!..పోతుందనికాదు.. అసలుపోకపోవచ్చు. లేదా మరోనెలకుఊడిపోవచ్చు. వెంటనే మరో ఉద్యోగం దొరకడం కష్టమంటున్నారు. ఈరోజుచేతికి దొరికినదాన్ని అవివేకంతో కాలదన్నితే...రేపు దొరుకుతుందన్న ఆశలేదు..." భర్తకళ్ళల్లోని భావాలను చదివేందుకు ప్రయత్నిస్తూ అంది.

"సరే, రేపువెళ్ళి జాయినుకా, వైదేహి"

భర్త కంఠంలో అయిష్టతను పసికట్టిన వైదేహి "నేనుద్యోగం చేయడం తప్పని మీ రెందుకనుకుంటున్నారండీ ?" అంది.

"తప్పనికాదు. ఏవిటో అది నీకర్థం కాదులే. నలుగురిలో చిన్నతనంగా ఉంటుంది."

"ఇందులో చిన్నతన మేముందండీ ? తప్పేమీ చేయడంలేదుగా ? లంచాలు తీసుకోవడం తప్పుకానప్పుడు ఇదితప్పెట్లా అవుతుంది ? రెండింట్లో ఏది తప్పండీ ?"

"ఏదో ఒకటి పోనిద్దూ! తల తిరిగిపోతూంది."

"అది సరే గానీండి, ఇకమీదట ఆ ప్రసాదా లేవీ పుచ్చుకోకండి! ఎందుకైనా మంచిది'–మృదువుగా నవ్వుతూ అంది.

"ఉహు. ఇంత జరిగాక ఇంకా తీసుకోవడమే ! ఇప్పటికీ గండం గడిస్తేచాలు."

ఆ గండ మెలాగో గడచి బయటపడితే, ఇక ప్రసాదాలు ముట్టకోనంటు మనస్సులో ప్రతిజ్ఞచేసుకుని అన్నాడు.

"భయపడకండి! దేవుడు మనలను చల్లగా చూస్తాడు. లేచిభోంచెయ్యండి !" అంది శాంత గంభీర స్వరంతో. బాబాయి కథ తన కల్పితమని అప్పుడేకాదు. ఎప్పటికీ చెప్పలేదు వైదేహి!!!